సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024

సీఎం దిష్టిబొమ్మ దహనం



సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో–కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ ఆరోపించారు. ఈమేరకు శనివారం సిరిసిల్ల నేతన్నచౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. గాలిపెల్లి బీసీ వెల్ఫేర్ హాస్టల్లో విద్యార్థికి పాముకాటు, నేరెళ్ల గురుకులంలో ఎలుకలు కరవడం, అక్కపెల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిలిచిపోవడం, గంభీరావుపేటలో అధ్యాపకులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఘటనలు జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

న్యూస్‌రీల్

అడ్వకేట్లు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత



పరీక్ష చేయించుకుంటున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లకల్చరల్: సామాజిక అవసరాలు, కక్షిదారుల న్యాయపరమైన ప్రయోజనాలు, కుటుంబ సంక్షేమం దృష్ట్యా న్యాయవాదులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత కోరారు. కరీంనగర్ ఫార్చ్యూన్ మెడికేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సిరిసిల్లలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం న్యాయవాదులకు ఉచితంగా గుండె వ్యాధి పరీక్షల శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. వేగం పెరిగిన జీవన శైలితో చిన్న వయసులోనే గుండె సంబంధ సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని, ఆస్పత్రి బృందాన్ని అభినందించారు. అనంతరం న్యాయమూర్తులు రాధికా జైస్వాల్, ప్రవీణ్‌కుమార్‌తోపాటు సుమారు 100 మంది న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు చేశారు. ప్రభుత్వ ప్లీడర్ కల్యాణ్ చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల సంజీవ్‌రెడ్డి, తంగళ్లపల్లి వెంకటి, కోడం సురేశ్, సబ్బని రవీందర్, కుడిక్యాల రాజేశ్, గుడ్ల కిషన్, నాగరాజుగౌడ్, ఆడెపు వేణు, మల్లేశ్, పరశురాం, బిట్ల విష్ణు, అన్నల్‌దాస్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే వాహన చట్టాలు, ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ (ఆర్‌ఎస్‌ఈ) తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్, సైన్‌బోర్డ్స్, వాహన చట్టాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ఉంటే రోడ్డు ప్రమాదాలు జరుగబోవన్నారు. సిరిసిల్లటౌన్ సీఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్సై రాజు, ఎన్జీవో ఓర్సు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు

- మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధిలో రూ.28లక్షలతో బతుకమ్మ, దసరా ఏర్పాట్లను చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ మాధవి అధ్యక్షతన శనివారం జరిగింది. ఆమె మాట్లాడుతూ వేములవాడతోపాటు విలీన గ్రామాల్లో బతుకమ్మ, దసరా వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. విద్యుత్ దీపాలు, రహదారుల మరమ్మతులు, ఇతర పనుల ఏర్పాటుకు రూ.28లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కమిషనర్ సంపత్‌రెడ్డి, ఏఈ నరసింహస్వామి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్ ఉన్నారు.

'సిరిసిల్ల అభివృద్ధిని విస్మరిస్తున్న కేటీఆర్'



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్ల అభివృద్ధిని ఎమ్మెల్యే కేటీఆర్ విస్మరిస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి విమర్శించారు. స్థానిక కార్మిక భవనంలో శనివారం నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ అమరవీరుల పేర్లను యూనివర్సిటీలకు పెడతామన్న సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. స్థానిక సమస్యలపై కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి దృష్టి పెట్టాలని కోరారు. వేణు, లింగం, జనార్దన్, రాయమల్లు పాల్గొన్నారు.

మాయగాళ్లున్నారు.. పైలం బిడ్డా




పరిణతి లేని వయసు.. మంచిచెడు ఏంటో అర్థం చేసుకోలేరు.. ఎవరు ఆప్యాయంగా పలకరిస్తే వారిని తమ ఆత్మీయులని అనుకుంటారు.. ఈ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, యువకులు, మధ్య వయస్కులు, పలు స్కూళ్లు, కళాశాలల్లో అయితే పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాలికలను వంచిస్తున్నారు.. లైంగిక దాడికి పాల్పడుతున్నారు.. ప్రేమ, పెళ్లి అంటూ వేధిస్తున్నారు.. నిత్యం ఎక్కడో ఒక చోట ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి.. ఇవన్నీ చూస్తున్న తల్లిదండ్రులు భయంభయంగా బతకాల్సిన దుస్థితి నెలకొంది. ఇటువంటి భయానక పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ కూతుళ్లకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి కచ్చితంగా చెప్పాలి. అలాగే, ఇంటికి వచ్చిన పిల్లలు మీతో అన్ని విషయాలు చెప్పుకునే వాతావరణం కల్పించాలి.– కరీంనగర్‌క్రైం/సిరిసిల్లక్రైం/జగిత్యాల/గోదావరిఖని

వారిది ఉన్నత కుటుంబం. ఒక్కగానొక్క కూతురు. పదోతరగతి చదువుతున్న సమయంలోనే ఆమె ఆకర్షణకు లోనైంది. మాయమాటలు నమ్మి మోసపోయింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మనోవేదనకు గురయ్యారు. బిడ్డా.. పద్ధతి మార్చుకో.. మంచిగ చదువుకో అని సున్నితంగా హెచ్చరించారు. అయినా లాభం లేకపోయింది. కారు నడిపే వ్యక్తితో వెళ్లిపోయింది. అతను కష్టపడితేనే పూట గడిచేది. ఇప్పుడు ఆ అమ్మాయిని సాకేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఉన్నత కుటుంబంలో పుట్టి పెరిగిన ఆ బాలిక మోసపోయానని తెలుసుకుంది. మనోవేదనకు గురవుతోంది.

ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని యువకుడితో ప్రేమలో పడింది. ఏం ఆలోచించకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయింది. కొన్నిరోజుల తర్వాత ప్రేమించిన యువకుడు ఆమెను వదిలించుకునేందుకు రెడీ అయ్యాడు. అయితే అతను ఇప్పటికే పలువురిని నమ్మించి మోసం చేసినట్లు తెలుసుకొని మనోవేదనకు గురవుతోంది.

'మూడో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడటంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. కోర్టులో చార్జిషీట్ వేయగా ఆ ఇద్దరికీ జీవితఖైదు విధిస్తూ జడ్జి తీర్పు నిచ్చారు.'



- వివరాలు8లో

కఠినంగా వ్యవహరిస్తాం



చిన్నారులపై అఘాయిత్యాల కేసుల్లో తల్లిదండ్రుల గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా గోప్యతను పాటిస్తూ భరోసా కల్పిస్తున్నాం. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య ఉంటే డయల్ 100కి సమాచారం ఇవ్వాలి.

– ఎం.శ్రీనివాస్, సీపీ, రామగుండం

నిర్భయంగా ఫిర్యాదు చేయాలి



జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. షీటీం, మెసేజ్ యువర్ ఎస్పీ నంబర్ 6303922572, డయల్100 అందుబాటులోకి తెచ్చాం. అనేక విద్యాలయాల్లో, గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఆపదలో ఉన్న వారు నిర్భయంగా ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, సిరిసిల్ల

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ఎస్జీఎఫ్ మండలస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

సిరిసిల్ల/వీర్నపల్లి(సిరిసిల్ల): విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. వీర్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల ఎస్జీఎఫ్ క్రీడాపోటీలను శనివారం ప్రారంభించి, విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం స్థానిక హైస్కూల్, మోడల్ స్కూల్, కేజీబీవీ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేజీబీవీ భవనంపైకి ఎక్కి పరిశీలించి, పైకి వెళ్లే ద్వారానికి తాళం వేయాలని, అవసరం ఉన్న చోట గ్రిల్స్ పెట్టించాలని సూచించారు.

సౌకర్యాలు కల్పించాలని విన్నపం

మండలంలోని విద్యాలయాల్లో సమస్యలు పేరుకుపోయాయని, వసతులు కల్పించాలని సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ అరుణ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ రవి కలెక్టర్‌ను కోరారు. మోడల్‌స్కూల్ సమయానికి బస్సులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా.. వెంటనే డిపో మేనేజర్‌తో కలెక్టర్ మాట్లాడి సమయానికి అనుకూలంగా బస్సులు నడిపించాలని సూచించారు.



కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న కలెక్టర్

సీడీపీ పనులపై నివేదిక ఇవ్వండి

జిల్లాలో సీడీపీ నిధులతో చేపట్టిన పనులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. రూ.51.85కోట్లు విలువైన 1833 పనులు మంజూరయ్యాయని, ఈ నిధులతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ ద్వారా 18 ఏజెన్సీలకు కేటాయించి పనులు చేశారన్నారు. రూ.16.98 కోట్లు ఖర్చు చేసి 738 పనులు పూర్తి చేశామని, రూ.8.46కోట్లకు సంబంధించిన 300 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మరో రూ.24.21 కోట్లతో చేపట్టిన 795 పనులు ప్రారంభంకాలేదని తెలిపారు. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆదేశించారు. సీపీవో శ్రీనివాసాచారి, పీఆర్ ఈఈ భూమేశ్, సెస్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రమేశ్‌కుమార్ ఉన్నారు.

బోయినపల్లి మార్కెట్ కమిటీ ఖరారు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారైంది. చైర్మన్‌గా బోయినపల్లికి చెందిన బోయిని ఎల్లేశ్‌యాదవ్, వైస్‌చైర్మన్‌గా దేశాయిపల్లికి చెందిన నిమ్మ వినోద్‌రెడ్డిని నియమించారు. డైరెక్టర్లుగా అనుముల హరికృష్ణ, మహ్మద్ యూసఫ్, బాలగోని వెంకటేశ్వర్లు, అద్దెంకి రమేశ్, గుడి రాజశేఖర్‌రెడ్డి, గంగిపల్లి లచ్చయ్య, నీరటి ప్రదీప్‌కుమార్, కల్లెపెల్లి సతీశ్, మెరుపుల మహేశ్, రోమాల అజయ్, ఏనుగుల కనకయ్య, జక్కని సందీప్, బోయినపల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామారావు, డీఎంవో సిరిసిల్ల, ఏడీఏ వేములవాడ, బోయినపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం



బోయిని ఎల్లేశ్‌యాదవ్



నిమ్మ వినోద్‌రెడ్డి

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన బోయిని ఎల్లేశ్ యాదవ్, వైస్‌చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, మెజార్టీ డైరెక్టర్లు పార్టీని నమ్ముకుని కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు అత్యంత సన్నిహితులుగా మెదిలారు. పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికి అవకాశం దక్కిందనే చర్చ సాగుతోంది.

దశాబ్ద కాలానికి దక్కిన పదవులు

- మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకం
- సిరిసిల్ల ప్రాంతంలోని ఐదు ఏఎంసీలకు నామినేటెడ్ పాలకవర్గాలు



వెల్మల స్వరూప, చైర్‌పర్సన్, సిరిసిల్ల ఏఎంసీ



షేక్ షబ్బీర్ బేగం, చైర్‌పర్సన్, రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ



కొమిరిశెట్టి విజయ, చైర్‌పర్సన్, గంభీరావుపేట ఏఎంసీ



తలారి రాణి, చైర్‌పర్సన్, పోత్గల్ ఏఎంసీ



లకావత్ రాములు, చైర్మన్, వీర్నపల్లి ఏఎంసీ

సిరిసిల్ల: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల నియామకాలు ఎట్టకేలకు కొన్ని వెల్లడించారు. దశాబ్దకాలంగా కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటింది. మధ్యలో పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఎన్నికల సందడి నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన ఫలితాలే రావడంతో ఆ పార్టీ నేతలకు ఉత్సాహాన్నిచ్చింది. ఎన్నికల తరువాత నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. కానీ ఎన్నికల సందడి ముగిసి నాలుగు నెలలైనా నామినేటెడ్ పదవులు రాకపోవడంతో జిల్లాకు చెందిన ముఖ్యనేతలు ఆశగా నిరీక్షించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు శుక్రవారం రాత్రి పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల కాలపరిమితో కమిటీలను నామినేటెడ్ చేస్తూ జీవో జారీ చేసింది. ఇప్పటికే మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట ఏఎంసీ పాలకవర్గాన్ని నియమించారు.

ఇంకా ఖరారు కానీ వేములవాడ పదవులు

వేములవాడ నియోజకవర్గంలోని ముఖ్యనేతలంతా నామినేటెడ్ పదవులు ఎప్పుడు ఇస్తారోనని ఆసక్తిగా నిరీక్షిస్తున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలుస్తూ ఎవరికి వారు నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు. బోయినపల్లి మార్కెట్ కమిటీ ఖరారు కాగా.. మిగతా వాటిపై స్పష్టత రాలేదు. పదేళ్ల తరువాత అధికారం రావడంతో నామినేటెడ్ పదవి సాధించి ప్రొటోకాల్‌లో డామినేషన్ చూపాలని కొందరు భావిస్తున్నారు.

నామినేటెడ్ పదవులు ఎన్నో..

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన నామినేటెడ్ పదవులు ఎన్నో ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పదవులు సైతం మన జిల్లాలోనే ఉండడం విశేషం. దశాబ్దకాలంగా వేములవాడ ఆలయ అభివృద్ధి కమిటీ నియామకానికి దూరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా వేములవాడ ఆలయ అభివృద్ధి కమిటీని వేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కమిటీలో స్థానం కల్పించారు. వస్త్రోత్పత్తి రంగం సిరిసిల్లలో స్థిరపడి ఉండగా.. రాష్ట్ర స్థాయిలో ఎంతో పేరున్న తెలంగాణ పవర్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీపీటీడీసీ), చేనేత డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠాత్మక జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పదవి ఉంది. ఈ పదవికి ప్రతి నెలా రూ.లక్ష వరకు జీతభత్యాలు ఉండడంతో ఈ పదవిపై చాలా మంది నేతలు గురిపెట్టారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్న కార్పొరేషన్లు, డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి.

ఐదు ఏఎంసీల పాలకవర్గాలు ఇవే..

సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వెల్మల స్వరూప, వైస్ చైర్‌పర్సన్‌గా నేరేళ్ల నర్సయ్య, వీర్నపల్లి ఏఎంసీ చైర్మన్‌గా లకావత్ రాములు, వైస్ చైర్మన్‌గా లెంకల లక్ష్మణ్, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా షేక్ షబ్బీర్‌భేగం, వైస్‌చైర్మన్‌గా గుండడి రాంరెడ్డి, గంభీరావుపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొమిరిశెట్టి విజయ, వైస్ చైర్మన్‌గా పత్తూరి అంజిరెడ్డి, ముస్తాబాద్ మండలం పోతుగల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తలారి రాణి, వైస్‌చైర్మన్‌గా వేముల రాంరెడ్డిలను నియమించారు. రాష్ట్రస్థాయి ముఖ్యనేతల సమక్షంలో ఏఎంసీల పాలకవర్గాల ప్రమాణ స్వీకారం ఉంటుందని భావిస్తున్నారు. సిరిసిల్ల ప్రాంత ఐదు ఏఎంసీలకు పాలకవర్గాల నియామకంలో ఈ ప్రాంత కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన కేకే మహేందర్‌రెడ్డి మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది. సిరిసిల్ల ప్రాంతంలోని చాలా మందికి నామినేటెడ్ పదవులు రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తుంది.

స్థానిక సంస్థలపైనా గురి

జూలై 4వ తేదీతో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసింది. స్థానిక సంస్థలకు ప్రత్యేకాధికారులను నియమించారు. మరో ఆరు నెలల్లో ఎన్నికలు ఉంటాయని ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. జిల్లాలో ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు, గ్రామసర్పంచ్ ఎన్నికలు ఉన్నాయి. కాంగ్రెస్‌లోని కొందరు నేతలు స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకుని జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, జెడ్పీటీసీ వంటి పదవులను దక్కించుకోవాలని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అంగబలం, అర్థబలం అవసరం. ఎన్నికల్లో గెలుపోటములు దైవాధీనం కావడంతో ఆర్థికంగా అంతగా లేని కాంగ్రెస్ నేతలు సులభంగా నామినేటెడ్ పదవులు దక్కించుకోవాలని భావిస్తున్నారు.

258 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- ఏ–గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,320.. కామన్ రకం రూ.2,300
- మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా
- ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సమీక్ష
- గంజాయి మత్తును వదిలించాలి
- జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశం

సిరిసిల్ల: జిల్లాలో 258 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్ వడ్లను కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. 2024–2025 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో శనివారం సమీక్షించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, ఈమేరకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ వసతి, టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. తాలు లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. ఏ–గ్రేడ్ వడ్లకు క్వింటాల్‌కు రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 నిర్ణయించిందని తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, వివిధ శాఖల ఆధ్వర్యంలో 12 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వివరించారు. జిల్లాలో 7,777 టార్పాలిన్లు, 766 తూకం వేసే యంత్రాలు, 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమ శాతం చూసే మెషిన్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. డీసీఎస్‌వో వసంతలక్ష్మి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రజిత, జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, డీసీవో రామకృష్ణ, డీఎంవో ప్రకాశ్, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

మత్తు వదించాలి

జిల్లాలో గంజాయి మత్తును వదిలించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశం నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, డీఏవో అఫ్జల్‌బేగం, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు ఉచిత న్యాయ సహాయం



సిరిసిల్లకల్చరల్‌: వివిధ నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు ఉండే చట్టపరమైన హక్కులపై అవగాహన పెరగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి రాధికా జైస్వాల్‌ పేర్కొన్నారు. ఈమేరకు రూపొందించిన పోస్టర్‌ను సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. అరెస్ట్‌ సమయంలో నిందితులకు ఉండే హక్కులపై అవగాహన పెంచాలని పోలీసులకు సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌ స్టేషన్లలో కక్షిదారులకు కనిపించేలా ఈ పోస్టర్‌ను ప్రదర్శించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు పరశురాం, మల్లేశ్‌యాదవ్‌, ఎనగందుల జ్యోతి, చింతోజు భాస్కర్‌, పట్టణ సీఐ కృష్ణ, మొగిలి ఉన్నారు.

రేషన్‌ డీలర్ల పోస్టులకు ఇంటర్వ్యూ

సిరిసిల్లటౌన్‌: రేషన్‌ షాపుల కేటాయింపునకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు సిరిసిల్ల ఆర్డీవో లొలేవర్‌ రమేశ్‌ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 58 రేషన్‌ షాపుల్లో డీలర్ల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్‌ వెలువడగా.. గత ఆదివారం సిరిసిల్లలో రాతపరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 830 మంది అభ్యర్థులు రాతపరీక్షకు దరఖాస్తు చేసుకోగా 735 మంది హాజరైనట్లు వివరించారు. 32కు పైగా మార్కులు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేశారు. 52 షాపులకు 160 మంది అభ్యర్థులకు గాను 1: 5 చొప్పున ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు వివరించారు. మిగతా 6 షాపులకు పూర్తిగా దరఖాస్తులు రాలేదని తదుపరి భర్తీ చేస్తామని వెల్లడించారు. డీఏవో మనోహర్‌రావు తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వేములవాడఅర్బన్‌: వేములవాడలోని జాతర గ్రౌండ్‌లో పురుగుల మందు తాగి వ్యక్తి పడి ఉండటంతో స్థానికులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి చెందిన పున్నాల కరుణాకర్‌రెడ్డి(38) పౌల్ట్రీ బిజినెస్‌లో నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు. గత మంగళవారం ఇంటి నుంచి వచ్చినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వేములవాడ టౌన్‌ ఎస్సై రమేశ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీబీ రహిత జిల్లానే లక్ష్యం

బోయినపల్లి: జిల్లాలో టీబీ వ్యాధి నివారణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు టీబీ అలర్ట్‌ ఇండియా ప్రోగ్రాం జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్‌ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం కోరెం, బోయినపల్లి ఉపకేంద్రాల సిబ్బందికి టీబీ ముక్త్‌ భారత్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి రేణుక, సూపర్‌వైజర్లు శశికుమార్‌, హేమలత, ఏఎన్‌ఎంలు ఉషారాణి, సరిత, వసంత, మంజుల, వరలక్ష్మి ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.


మాయగాళ్లున్నారు..పైలం బిడ్డా

- 'చిన్నారులను చిదిమేస్తున్నారు'
- పసిమొగ్గలపై పాశవికంగా లైంగిక దాడులు
- మద్యం, గంజాయి మత్తులో పైశాచికత్వం
- ప్రేమ, పెళ్లి అంటూ వంచిస్తున్న ప్రబుద్ధులు
- చిన్నారులపై దాడుల నియంత్రణకు మహిళా భద్రతా విభాగం చర్యలు
- రోజురోజుకూ పెరుగుతున్న పోక్సో కేసులు
- తల్లిదండ్రులూ.. ఆడపిల్లలకు జాగ్రత్తలు చెప్పండి

'బిడ్డా! మీతో ఆటలాడుతూనో.. చాక్లెట్‌ ఇస్తూనో మీ ఒంటి మీద చేతులేస్తారు. జరంత హుషారు ఉండాలి. చాతిపై ఎవరు చేయి వేసినా అమ్మకు చెప్పాలి. నడుము కింద, వెనక వైపు, రెండు కాళ్ల మధ్య చేయి వేసినా పెద్ద తప్పు. ఉరుక్కుంటూ పోయి అమ్మకు చెప్పాలి. బిడ్డా మళ్లీ చెబుతున్నా.. ఈ మూడు జాగల్లో చేయి వేసేది మీతో ఆడుకునే దోస్తయినా, పాఠాలు చెప్పే మాస్టారైనా, ఎదురింటి అంకులైనా, ఇంట్లో తాత, మామ, అన్న, తమ్ముడు, ఆఖరికి కన్న తండ్రి అయినా సరే అమ్మకు చెప్పాలి.'

– ఇటీవల వచ్చిన ఓ సినిమాలో గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ ప్రాధాన్యంపై హీరో చెప్పిన మాటలివి.

కరీంనగర్‌ క్రైం/సిరిసిల్ల క్రైం/జగిత్యాల/గోదావరిఖని(రామగుండం): నేటి సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోంది. వారి అమాయకత్వమే ఆసరాగా కామాంధులు పసిమొగ్గలపై పాశవికంగా లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. అభం శుభం తెలియని చిన్నారులను చిదిమేస్తున్నారు. మరోవైపు ప్రేమ, పెళ్లి అంటూ వంచిస్తున్న ప్రబుద్ధులు అమ్మాయిలు తీసుకువచ్చిన ఆభరణాలు, డబ్బు కాజేసి, ఆపై వ్యభిచార ఊబిలోకి నెట్టేస్తున్నారు. ఈ తరహా కేసులు ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. చిన్నారులపై లైంగిక దాడి, అత్యాచారాలు చేసేవారిపై పోక్సో కేసులు నమోదు చేస్తున్నామని, కోర్టులు సైతం వీటిని తీవ్రంగా పరిగణించి, నేరస్తులకు శిక్ష విధిస్తున్నాయని అంటున్నారు.



గంజాయి, మద్యం మత్తులోనే ఎక్కువ

గంజాయి, మద్యం మత్తులోనే చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులు, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఓ సీనియర్‌ పోలీస్‌ అధికారి తెలిపారు. ఇలా చేసేవారిలో తెలిసినవారు, బంధువులు, ఇరుగుపొరుగువారు, ఒకే కాలనీకి చెందినవారే ఎక్కువ మంది అని పేర్కొన్నారు. మరికొన్ని కేసుల్లో పాఠాలు బోధించే గురువులు.. ఇంకొన్నింట్లో కుటుంబసభ్యులే ఉంటుండటంతో బాధితులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు.

రెండు పోక్సో కోర్టులు..

కరీంనగర్‌ జిల్లాలోని న్యాయస్థానాల సముదాయాల్లో పోక్సో కేసులను విచారించడానికి రెండు ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. వీటిల్లో కేసుల విచారణ వేగంగా సాగి, నేరస్తులకు శిక్షలు పడుతున్నాయి.

దర్యాప్తు అధికారులకు ప్రత్యేక శిక్షణ

చిన్నారులపై లైంగిక దాడుల అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ రాష్ట్రస్థాయి మహిళా భద్రతా విభాగం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. కరీంనగర్‌ పోలీసులు పోక్సో కేసుల్లో శిక్షల శాతాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దర్యాప్తు సరిగా లేకపోతే న్యాయస్థానాల్లో కేసులు వీగిపోతాయని దర్యాప్తు అధికారులకు ప్రత్యేక శిక్షణతోపాటు పలు మెలకువలు నేర్పిస్తున్నారు. కేసు నమోదు చేయడం, సీడీ ఫైల్‌ను రూపొందించడం, సాక్ష్యాధారాలు సేకరించడం, అభియోగ పత్రాలు దాఖలు చేయడం, న్యాయస్థానాల్లో జరిగే ట్రయల్స్‌లో పకడ్బందీగా సాక్ష్యాలు ఇప్పించడం వంటివి చేస్తున్నారు.

ఇవీ కారణాలు..

- చదువుపైనే దృష్టి సారిస్తుండటంతో సమాజంలో జరుగుతున్న అంశాలపై విద్యార్థినులకు అవగాహన కొరవడుతోంది.
- పాఠశాలల్లో గుడ్‌, బ్యాడ్‌ టచ్‌ పాఠ్యాంశాలు చెప్పేవారు లేరు.
- పిల్లల్లో తాను చిన్నపిల్లని కాదని సొంత నిర్ణయాలు తీసుకోగలననే అభిప్రాయం.
- పరిణతిలేని వయసు, తల్లిదండ్రుల పర్యవేక్షణలోపం.
- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిళ్లు.
- హార్మోన్ల ప్రభావం, లైంగిక అంశాలపై ఆసక్తి.
- ప్రలోభాలకు గురికావడం.

ఆడపిల్లకు వీటి గురించి చెప్పండి..

శరీర భాగాలు

ప్రతీ తల్లి తన కూతురికి ఆమె శరీర భాగాల గురించి వివరించాలి. ఎవరైనా వారి ప్రైవేట్‌ భాగాలను తాకడానికి ప్రయత్నిస్తే ఎలా ప్రతిఘటించాలో నేర్పాలి. అలాగే, అలా ప్రవర్తించిన వ్యక్తి గురించి కచ్చితంగా చెప్పాలని చెప్పాలి.

నో చెప్పడం

పిల్లలకు నో చెప్పడం కచ్చితంగా నేర్పాలి. అంటే.. వారు బయటకు వెళ్లినప్పుడు ఎవరైనా ప్రేమగా ఏదైనా ఇచ్చినా, లేదా ఎక్కడికైనా వెళదామని అడిగినా.. నో చెప్పాలని సూచించాలి.

గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌

గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ మధ్య వ్యత్యాసాన్ని ఆడపిల్లలకు వివరించాలి. ఒక వ్యక్తి పిల్లల తల లేదా నుదుటిని ప్రేమతో తాకినప్పుడు అది మంచి స్పర్శ అవుతుంది. అలా కాకుండా వారి బుగ్గలు లాగడం, తట్టడం, ప్రైవేట్‌ పార్ట్స్‌ని తాకడం బ్యాడ్‌ టచ్‌ కిందికి వస్తాయని చెప్పాలి.

ఎలాంటి వ్యక్తులకు దూరంగా ఉండాలి

మీ కూతురు ఎలాంటి వ్యక్తులకు దూరంగా ఉండాలో చెప్పండి. అంటే.. ఎవరైనా వారిని బలవంతంగా ఒడిలో కూర్చోబెట్టుకున్నా, తాకినా లేదా ముద్దు పెట్టడానికి ప్రయత్నించినా వెంటనే అక్కడి నుంచి పారిపోవాలని పిల్లలకు చెప్పాలి.

3-4 ఏళ్ల పాపకు ఇవి నేర్పండి

3–4 ఏళ్ల వయసులో ఉన్న కూతురికి గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ మధ్య తేడాను కచ్చితంగా చెప్పాలి. అలాగే, రోజూ వారితో కాసేపు మాట్లాడండి. అయితే, ఆడపిల్లలు ఏదైనా తప్పు జరిగినప్పుడు తల్లిదండ్రులకు అంత తొందరగా చెప్పరు. కాబట్టి వారి ప్రవర్తనపై శ్రద్ధ పెట్టాలి. పాప ప్రవర్తనలో తేడా కనిపిస్తే కచ్చితంగా ఆమె దగ్గర కూర్చొని, ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

అవగాహన కల్పిస్తున్నాం



షీటీం ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు సదస్సులు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ గురించి వివరించాలి. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే అమ్మాయిలు వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలి. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలి.

– పి.శ్రీలత, కరీంనగర్‌ మహిళా పోలీస్‌స్టేషన్‌ సీఐ, షీటీం ఇన్‌చార్జి

సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు



ప్రస్తుతం సెల్‌ఫోన్లతోనే అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. పిల్లలను వీటికి దూరంగా ఉంచాలి. ఇంటర్నెట్‌ అరచేతిలో ఉండటంతో ప్రతీది అందుబాటులో ఉంటోంది. మంచికి వినియోగించుకోవాలి. చెడు వ్యసనాలతో అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ఈ విషయమై చర్యలు తీసుకుంటున్నాం.

– రఘుచందర్‌, డీఎస్పీ, జగిత్యాల

బ్యాడ్‌, గుడ్‌ టచ్‌ తెలియాలి



ప్రతీ విద్యార్థినికి గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ తెలియాలి. స్కూల్లో రోజంతా ఏం చేశారని అడుగుతూ తల్లిదండ్రులు పిల్లలతో కొంత సమయం గడపాలి. తెలిసీ తెలియని వయసులో బాలికలు లైంగిక వేధింపులకు గురైతే వారి జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

– దాసరి రఘు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గోదావరిఖని

సంస్కారం నేర్పాలి



మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించాలి. గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ గురించి వివరించాలి. ఆడవాళ్లను గౌరవించే సంస్కారాన్ని అబ్బాయిలకు నేర్పాలి. అప్పుడే అత్యాచారాలు తగ్గే అవకాశం ఉంటుంది. మహిళలకు గౌరవం పెరుగుతుంది.

– లోకిని శారద, గెజిటెడ్‌ హెచ్‌ఎం, బాలికల హైస్కూల్‌, సిరిసిల్ల

ఆరోగ్యానికి 'సహకారం'

- టెస్కాబ్‌, ఈ–స్వస్థ్‌ ఆధ్వర్యంలో 'ఈ–క్లినిక్‌లు'
- రాష్ట్రంలో మొట్టమొదటి క్లినిక్‌ గంభీరావుపేటలో ప్రారంభం
- నాలుగు జిల్లాల్లో 16 క్లినిక్‌ల ఏర్పాటుకు చర్యలు



గంభీరావుపేటలో ఏర్పాటైన ఈ–క్లినిక్‌



క్లినిక్‌ ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో సేవలందిస్తున్న సహకార సంఘాలు మరో అడుగు ముందుకేశాయి. ప్రజా ఆరోగ్య పరిరక్షణకు సేవలందించాలని టెస్కాబ్‌, ఈ–స్వస్థ్‌ సంస్థలు సంయుక్తంగా ×ఈ–క్లినిక్‌®లు ఏర్పాటు చేస్తున్నాయి. రాష్ట్రంలో కరీంనగర్‌, వరంగల్‌, నిజామాబాద్‌, ఖమ్మం జిల్లాల్లో నాలుగు చొప్పున ఈ–క్లినిక్‌లు ఏర్పాటు చేయడానికి పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా పరిధిలోని రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట సింగిల్‌విండో పరిధిలో ఈ–క్లినిక్‌ ఏర్పాటు చేశారు. శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యాపారంతోపాటు వడ్ల కొనుగోలు చేపడుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్న సహకార సంఘాలు సభ్యులకు, ప్రజలకు వైద్య సేవలందించడానికి ముందుకు రావడంపై హర్షం వ్యక్తమవుతోంది.

అందుబాటులో మందులు

సంఘం పరిధిలోని గంభీరావుపేట, ముస్తఫానగర్‌, దమ్మన్నపేట, నాగంపేట, నర్మాల, దేశాయిపేట, గోరింటాల, గజసింగవరం, సముద్రలింగాపూర్‌, లక్ష్మీపూర్‌, శ్రీనివాస్‌పూర్‌, రామానుజాపూర్‌, కుర్దులింగంపల్లి, పొన్నాపల్లె, మల్లుపల్లి, రాజేశ్వర్‌రావునగర్‌ గ్రామాల్లో దాదాపు 4వేల మంది సభ్యులు ఉన్నారు. వీరితోపాటు ఆయా గ్రామాల ప్రజలకు వైద్యసేవలందించనున్నారు. మహిళల వైద్యసేవలకు ప్రాధాన్యతనివ్వనున్నారు. వైద్యసేవలు పొందాలనుకునే వారు సహకార సంఘంలో రూ.375 చెల్లించి ఈ–కార్డు పొందాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రంలోనే మొట్టమొదటి ఈ–క్లినిక్‌ను ఈ–స్వస్థ్‌ సహకారంతో గంభీరావుపేట సింగిల్‌విండోలో ఏర్పాటు చేశాం. ప్రజలు క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి. కరీంనగర్‌ కేంద్ర సహకార బ్యాంక్‌ పరిధిలో మరో మూడు ఈ–క్లినిక్‌లను ఏర్పాటు చేస్తాం. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లినిక్‌లో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి.

– కొండూరు రవీందర్‌రావు, నాఫ్కాబ్‌ చైర్మన్‌

బాపూజీ ఆదర్శం ఆచరణీయం



కొండాలక్ష్మణ్‌ బాపూజీ వర్ధంతి వేడుకల్లో చైర్‌పర్సన్‌ కళ, ప్రముఖులు

సిరిసిల్ల మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళ

సిరిసిల్లటౌన్‌: కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆదర్శాలు ఆచరణీయమని సిరిసిల్ల మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళ పేర్కొన్నారు. బాపూజీ వర్ధంతిని శనివారం రాజకీయపార్టీల ఆధ్వర్యంలో స్థానిక కొండాలక్ష్మణ్‌చౌక్‌లో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీతో కలిసి చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. బాపూజీ ఆదర్శాలు భావితరాలకు అందాలన్న లక్ష్యంతో సిరిసిల్లలో మహనీయుడి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. టీఎస్పీటీడీసీ మాజీ చైర్మన్‌ గూడూరి ప్రవీణ్‌, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు చొక్కదండి ప్రకాశ్‌, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పద్మశాలీ ప్రముఖులు ఆడెపు రవీందర్‌, గాజుల బాలయ్య, దిడ్డి రాజు, గోనె ఎల్లప్ప, బొల్లి రామ్మోహన్‌, మండల సత్యం తదితరులు పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్‌ బాపూజి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వినాయక విగ్రహాలకు నిమజ్జనం

సాక్షి ఎఫెక్ట్‌..

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ మైదానం పక్కనే రోడ్డుపైన ఏడాదిగా ఉన్న భారీ వినాయకుడి విగ్రహాలు నిరాదరణకు గురవుతున్న విషయాన్ని 'సాక్షి'లో శనివారం 'భక్తులారా.. మా వైపు చూడండి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్‌ అధికారులు స్పందించారు. చైర్‌పర్సన్‌ జిందం కళాచక్రపాణి, కమిషనర్‌ మీర్జా ఫసత్‌ అలీభేగ్‌ ఆ విగ్రహాలను తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణను ఆదేశించారు. ఈమేరకు కాలేజీ మైదానం పక్కనున్న భారీ విగ్రహంతోపాటు ఏడు విగ్రహాలను జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో మానేరు తీరానికి తరలించి నిమజ్జనం చేశారు. గతేడాది విగ్రహాల వ్యాపారి ఆ విగ్రహాలను తెచ్చి ఇక్కడ వ్యాపారం చేశాడు. అవి అమ్ముడుపోకపోవడంతో అలాగే వదిలేశాడు.



విగ్రహాలను తొలగిస్తున్న మున్సిపల్‌ సిబ్బంది

ఆ అధికారులను మార్చాల్సిందే!

- అధిష్టానానికి ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌ నేతల ఫిర్యాదు

'మా జిల్లాలో అధికారులు ముఖ్యంగా పోలీసులు మా మాట వినడం లేదు. ఏం చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇలా అయితే కష్టం. ఆ పోలీసు అధికారులను బదిలీ చేయండి. బీఆర్‌ఎస్‌ హయంలో నియామకమైన అధికారులే ఇంకా జిల్లాల్లో అక్కడక్కడా కీలక బాధ్యతల్లో ఉన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చినా మార్పు కనిపించడం లేదు. అలాంటి అధికారులను మార్చండి.'

– కాంగ్రెస్‌ అధిష్టానానికి ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు, నేతల మొర ఇది



ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌, ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ

కరీంనగర్‌ కార్పొరేషన్‌: పీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ పరిస్థితిపై గాంధీభవన్‌లో సమీక్షలు చేపట్టారు. శనివారం ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా నేతలతో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షితో కలిసి సమావేశమయ్యారు. జిల్లాలో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పథకాలు, విధానాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు, పార్టీ కేడర్‌తో సమన్వయం తదితర అంశాలు చర్చించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కరీంనగర్‌, రాజన్నసిరిసిల్ల జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు పోలీసు అధికారులపై ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు తమ మాట ఖాతరు చేయడం లేదని, వారిని బదిలీ చేసేలా చూడాలని విన్నవించారు. బీఆర్‌ఎస్‌ హయాంలో నియమితులైన అధికారులు, కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ తీరు మార్చుకోవడం లేదని అభిప్రాయపడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ సూచించారు. కరీంనగర్‌, రామగుండం నగరపాలకసంస్థలతో పాటు అన్ని మున్సిపాలిటీలు, నాలుగు జెడ్పీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను కైవసం చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ పార్టీని సమన్వయ పరుచుకుని స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాలన్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచాం, ఇక మాకు ఏం పనిలేదన్నట్లుగా భావించరాదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రాచుర్యం కల్పించాలని, ప్రతిపక్ష ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌, ఆది శ్రీనివాస్‌, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌, డాక్టర్‌ సంజయ్‌, కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్‌ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలు పాల్గొన్నారు.

ఈజీఎస్‌ గద్దె కూలి మహిళ మృతి



వీర్నపల్లి(సిరిసిల్ల): గోడ కూలి మీద పడడంతో మహిళ మృతిచెందిన ఘటన శనివారం వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన బానోత్‌ లక్ష్మి(62) గేదెలు కాస్తూ ఉపాధి పొందుతుంది. పశువులను మేత కోసం తండా శివారులోని శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లింది. అక్కడే ఉన్న ఈజీఎస్‌ గద్దెకు ఒరిగి కూర్చుంది. గేదెలు తాకడంతో గద్దె కూలింది. అటుగా వచ్చిన వారు గమనించి పెళ్లలు తొలగించి చూడగా అప్పటికే మృతిచెందింది. మృతురాలికి భర్త రావూజీ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. ఎస్సై ఎల్లయ్యగౌడ్‌ కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు పరామర్శ



సిరిసిల్ల: ఎల్లారెడ్డిపేటలో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులను జిల్లా వైద్యాధికారి వసంతరావు శనివారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి బీసీ హాస్టల్‌లో పాముకాటుకు గురైన ధరావత్‌ రోహిత్‌కు అందిస్తున్న వైద్యసేవలపై తెలుసుకున్నారు. రోహిత్‌తో మాట్లాడుతూ భయపడవద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. అదే ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన పర్లెపల్లి అశ్వితకు సైకాలజిస్ట్‌ డాక్టర్‌ ప్రవీణతో కౌన్సెలింగ్‌ ఇప్పించారు. ఇద్దరు విద్యార్థులు త్వరగా కోలుకునే విధంగా వైద్యసేవలు అందించాలని అశ్విని ఆస్పత్రి డాక్టర్‌ సత్యనారాయణస్వామిని జిల్లా వైద్యాధికారి కోరారు.

నాటుబాంబు ఘటనపై విచారణ

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో జరిగిన నాటుబాంబు ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ధర్మారంలో మల్లేశం అనే రైతుకు చెందిన గేదె నాటుబాంబు పేలి గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయమై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్‌ ధర్మారం గ్రామానికి వెళ్లి సంఘటనపై విచారణ చేపట్టారు. ధర్మారం గ్రామానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా పలువురికి నాటుబాంబులు విక్రయించినట్లు పోలీసులకు చెప్పారు. అతడు చెప్పిన వివరాల ప్రకారం రాజన్నగొల్లపల్లికి చెందిన ముగ్గురు, ధర్మారానికి చెందిన మరొకరిని, సిరిసిల్ల శివారులోని బోనాలకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. వీరిలో ఓ నిందితుని వద్ద నాటుబాంబులు లభ్యమైనట్లు సమాచారం. ధర్మారం గ్రామానికి చెందిన నిందితున్ని తీసుకుని మరిమడ్ల గ్రామానికి వెళ్లి విచారణ చేపడుతున్నారు.

వీరసముద్రంలో చిరుత పాదముద్రలు?



ముస్తాబాద్‌: మండలంలోని పోతుగల్‌ వీరసముద్రంలో చిరుతపులి సంచరిస్తుందని రైతులు అక్కిరాజు పర్శరాములు, శ్రీశైలం, రమేశ్‌, శ్రీనివాస్‌, నాంపెల్లి, ఎల్లం, మురళి, సురేశ్‌, నరేశ్‌ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరసముద్రం కట్టపై చిరుత అడుగులను శనివారం గుర్తించామన్నారు. ఎస్సై గణేశ్‌, అటవీశాఖ అధికారి అంజలికి ఫిర్యాదు చేశామన్నారు. ఈమేరకు ఎస్సై కట్టపై పాదముద్రలను పరిశీలించారు. అటవీశాఖ అధికారులు అడుగులను గుర్తించిన అనంతరమే చిరుతా లేక మరేదైన జంతువా అని నిర్ధారిస్తామన్నారు. పాదముద్రలను ఫొటోలు తీసి అధికారులకు పంపించామని, రైతులు జాగ్రత్తగా వుండాలని పోలీసులు సూచించారు.

స్కానింగ్‌ సెంటర్ల తనిఖీ



సిరిసిల్ల: సిరిసిల్లలోని ప్రైవేటు ఆస్పత్రుల స్కానింగ్‌ సెంటర్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి శనివారం తనిఖీ చేశారు. స్కానింగ్‌ కేంద్రాల్లో గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని, నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. స్కానింగ్‌ కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించి, స్కానింగ్‌ చేసిన పేషెంట్ల వివరాలు నమోదు చేసుకున్నారు. అందరికీ కనిపించేలా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి, లింగ నిర్ధారణ బోర్డులను, రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌, పొల్యూషన్‌ సర్టిఫికెట్‌లను గోడలపై ప్రదర్శించాలని సూచించారు. హెచ్‌ఈ బాలయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్‌ పోస్టులు అమ్ముకున్నారు

సిరిసిల్లటౌన్‌: 'రేషన్‌ డీలర్ల పోస్టులను అమ్ముకుని మాలాంటి నిరుద్యోగులను దగా చేశారు' అని చౌకధరల దుకాణాల దరఖాస్తుదారులు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌ ఎదుట ధర్నా చేశారు. జిల్లాలోని రేషన్‌ షాపుల డీలర్ల నియామకానికి వందల సంఖ్యలో నిరుద్యోగులు రాతపరీక్షకు హాజరైనట్లు తెలిపారు. కలెక్టర్‌ స్పందించి విచారణ జరిపించాలని కోరారు.

డీలర్ల నియామకాల్లో అవకతవలు

సిరిసిల్లఅర్బన్‌: రేషన్‌ డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరిగాయని బీఆర్‌ఎస్‌ నాయకుడు మాట్ల మధు ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి డబ్బులు తీసుకొని డీలర్‌షిప్‌లను అమ్ముకున్నారని ఆరోపించారు. రమేశ్‌, ఎల్లయ్య, కొమురయ్య, దేవేందర్‌, అమర్‌రావు, ప్రేమ్‌కుమార్‌, చంటి ఉన్నారు.



ధర్నా చేస్తున్న నిరుద్యోగులు